ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

గురువారం 20 నవంబరు 2025





అరటి రైతుతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ప్రతి ఎకరాకు నీరందిస్తా..



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

- గాలేరు నగరి ఏడాదిలో పూర్తి
- జిల్లాలో జలాశయాలు కళకళ
- ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి
- సీఎం చంద్రబాబు టూర్ సక్సెస్



అన్నదాతలకు మెగా చెక్కు అందచేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేస్తామని, ప్రతి ఎకరాకు సాగునీరిచ్చి సీమను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నిధులను పెండ్లిమర్రి మండలంలోని భైరవగుట్ట వద్ద ఏర్పాటు చేసిన రచ్చబండలో విడుదల చేశారు. ప్రధాని మోదీ కోయంబత్తూరులో పీఎం కిసాన్ పథకం ప్రారంభించగా సీఎం చంద్రబాబుతో సహా ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో పలువురు తిలకించారు. అనంతరం చంద్రబాబు రెండో విడత రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,135 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రతనాల సీమగా ఉన్న రాయలసీమ రాళ్లసీమగా మారిందన్నారు. ఇక సీమపై ఆశలు వదులుకునే సమయంలో దివంగత ఎన్టీఆర్ ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారన్నారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, కేసీ కెనాల్ ఆధునీకరించారన్నారు. ఇక పట్టిసీమతో 120 టీఎంసీల క్రిష్ణా డెల్టా నీటిని సీమకు ఇస్తున్నామన్నారు. జిల్లాలో రిజర్వాయర్లు, చెరువులు 95 శాతం నీటితో కళకళాడుతున్నాయన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందని, ఇక్కడికి పరిశ్రమలు వస్తాయన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సక్సెస్ అయింది. రచ్చబండతో పాటు రైతులతో సీఎం ముఖాముఖి నిర్వహించి పంటలను పరిశీలించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్త కృష్ణచైతన్యరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సీఎం పర్యటన సాగిందిలా..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధుల కార్యక్రమంలో పాల్గొనేందుకు పెండ్లిమర్రి మండలంలో పర్యటించారు.

- పుట్టపర్తి నుంచి ప్రత్యేక హెలికాప్టరులో సీఎం చంద్రబాబునాయుడు పెండ్లిమర్రిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 2.25 గంటలకు చేరుకున్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యేలు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ యువ నాయకుడు శ్రవణ్‌రాజ్, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చిన్నయ్య సీఎంకు స్వాగతం పలికారు.

భద్రతను పర్యవేక్షించిన డీఐజీ

సీఎం చంద్రబాబునాయుడు పెండ్లిమర్రి పర్యటన నేపథ్యంలో బుధవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్, ఎస్పీ షెల్కే నచికేత్‌విశ్వనాథ్ భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. హెలిప్యాడ్, రచ్చబండ వేదిక, పార్కింగ్ తదితర ప్రదేశాలను ఎస్పీ కలియదిరిగి పరిశీలించారు.

- 2.35 నిమిషాలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో సీఎం బయల్దేరి పెండ్లిమర్రిలో మన గ్రోమోర్ సెంటరుకు చేరుకుని రైతులతో ముఖాముఖి నిర్వహించారు.
- 2.58 నిమిషాలకు అక్కడి నుంచి బయలుదేరి 3.10 గంటలకు భైరవగుట్ట వద్ద ఏర్పాటు చేసిన రచ్చబండ వద్దకు చేరుకున్నారు.
- ప్రధాని మోదీ కోయంబత్తూరులో పీఎం కిసాన్‌ను ప్రారంభించగా 3.24 నుంచి 4.13 నిమిషాల వరకు మోదీ ప్రసంగం సాగింది. మోదీ ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో సీఎం చంద్రబాబుతో పాటు అందరూ వీక్షించారు.
- 4.20 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ప్రారంభించి 5.20 గంటలకు ముగించారు. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.31.35 కోట్లు జమ చేశారు.
- 5.35 గంటలకు పెండ్లిమర్రి మండలంలోని చిన్నదాసరిపల్లెలో వ్యవసాయ క్షేత్రాన్ని రైతులతో కలిసి ట్రాక్టరు మీద పరిశీలనకు వెళ్లారు. వ్యవసాయ క్షేత్రంకు విచ్చేసిన సీఎంకు మహిళా నేతలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉద్యాన పంటలను సీఎం పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా జీవ ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసే విధానాన్ని అధికారులు సీఎంకు వివరించారు. పంటల సస్యరక్షణ, సాగు విధానంలో పాటించే మెలకువలు, దిగుబడి, మార్కెటింగ్ విధానాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.
- 6.30 గంటలకు కార్యకర్తల సమావేశం వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం 8.25కు రోడ్డుమార్గాన ఎయిర్‌పోర్టు చేరుకున్న సీఎం 8.50కి ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, డీఐజీ కోయ ప్రవీణ్, జేసీ అదితిసింగ్, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు.

సైడ్‌లైట్స్

- అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆకుపచ్చ రంగు చొక్కాతో ఉండగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- మధ్యాహ్నం గంటకు పైగా ముఖ్యమంత్రి కోసం రైతులు ఏ మాత్రం విసుగు చెందకుండా ఆనందంగానే గ్యాలరీలో కూర్చుని ఎదురు చూశారు.
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా చెట్టు కిందనే అరుగు పైన కూర్చోగా, ప్రజలు టెంట్లు, బారికేడ్లు లేకుండా నిరాడంబరంగా కూర్చున్న ముఖ్యమంత్రిని చూసి ఆనందం వ్యక్తం చేశారు.
- ఎమ్మెల్యే చైతన్యరెడ్డి సీఎంను ఏపీ సీఎంగా కాకుండా వ్యాపార దిగ్గజం సీఈవోగా పోల్చారు. అలాగే 30ఏళ్ల కుర్రాడిలా సాఫ్ట్‌వేర్ ఇంజనీరులా సీఎం అభివృద్ధిని పరిగెత్తిస్తున్నారని చెప్పడంతో వేదిక హర్షధ్వానాలు మిన్నంటాయి.

ప్రత్యేకంగా వేదిక

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం, రెండో విడత నిధులు జమ చేసే రచ్చబండ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చిన్నదాసరిపల్లె సమీపంలోని భైరవగుట్ట వద్ద కడప-పులివెందుల ప్రధాన రహదారి పక్కనే వేపచెట్టు కింద పొలంలో రచ్చబండ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వచ్చిన రైతులతో పాటు సీఎం చంద్రబాబు సహా అందరూ మెడలో ఆకుపచ్చ కండువా ధరించారు. నులక పీటలపై రైతులు ఆసీనులయ్యారు. వేదిక ఆవరణలో ట్రాక్టర్లపై వరిగడ్డి, ట్రాక్టర్లు, ఎద్దులు, మేకలు, గొర్రెలు లాంటివి ఏర్పాటు చేసి వేదికను వ్యవసాయం క్షేత్రంలా తీర్చిదిద్దారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నులకపీటలు

రైతు బాంధవుడు సీఎం చంద్రబాబు

- రైతు సంక్షేమం.. అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం
- అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతాంగం, వారి సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని, ఆయన నేడు రైతు బాంధవుడుగా మారాడని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడూ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు ఏడాదికి అన్నదాత సుఖీభవ పథకం, పీఎస్ కిసాన్ పథకం ద్వారా రూ.20 వేలు రైతుల అకౌంట్లో జమ చేయడం జరుగుతున్నదని తెలిపారు. మండలంలో 8 వేల మంది రైతులకు ఐదు కోట్ల రూపాయలు జమ అవుతాయని తెలిపారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి జల్‌జీవన్ పథకం ద్వారా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రూ.350 కోట్లతో ప్రతి పల్లెకు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామని ప్రస్తుతం ఈ పథకానికి సంబంధించి పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. అలాగే రూ.100 కోట్లతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెరువులకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి సౌకర్యం కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ భాగ్యలత, మండల టీడీపీ అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, సర్పంచ్ పార్థసారధిరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున, మాజీ సర్పంచులు మహమ్మద్‌రియాజ్, ఫరీద్‌బాషా, మాజీ ఎంపీటీసీలు రెడ్డిప్రసాద్ రెడ్డి, చిన్నరెడ్డి, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, టీడీపీ నాయకులు కాల్వపల్లి రాంమోహన్‌నాయుడు, మహబూబ్‌బాషా, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం నరసింహస్వామి కల్యాణం



నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణాన్ని వేదపండితులు బుధవారం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జెండర్ రిసోర్స్ సెంటర్లు

- డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు




మహిళా సమాఖ్య శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు

మదనపల్లె టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జెండర్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గ మహిళా సమాఖ్య అధికారులకు ఒకరోజు శిక్షణలో పీడీ మాట్లాడుతూ గతంలో మదనపల్లెకు మాత్రమే కేటాయించిన జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ఇప్పుడు జిల్లాలోని పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లెలో కూడా ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు గ్రూపు స్థాయిలో, గ్రామ స్థాయిలో మహిళలను అసమానత్వంతో చూసే వారిని గుర్తించి, ఎప్పటికప్పుడు మహిళల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సంస్థాగత నిర్మాణంలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం గైడ్‌లైన్స్ ప్రకారం ఈ సెంటర్లను ఏర్పాటు చేశామని, ఇక మీదట ప్రతి మండలంలో ఈ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణలో చెప్పిన అంశాలను సీసీలు, ఏపీఎంలు క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ధర్మరాజు, స్త్రీ నిధి డీజీఎం ప్రకాశ్, ఏరియా కో-ఆర్డినేటర్ గంగాధర్, ఏపీఎంలు సాంబశివ, ఖిజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిని తవ్వి... పొలానికి తరలించి...!

- చెరువులు, గుట్టలు గుల్ల



అమిలేపల్లె చెరువులో మట్టిని టిప్పర్‌కు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

గుర్రంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు, గుట్టల్లో మట్టిని ఎక్స్‌కవేటర్లతో మట్టి మాఫియా తవ్వేస్తున్నారు. మట్టి మాఫియా దందాకు చెరువులు, గుట్టలు తమ రూపురేఖలను కోల్పోతున్నాయి. మట్టిని చెరువులో ఇష్టానుసారంగా తోడేయడంతో ఏర్పడిన గుంతలు అఘాతాలను తలపిస్తున్నాయి. చెరువులు, గుట్టలను తోడేస్తునారని సంబంధిత అధికారులకు చెప్పినా చూసీచూడనట్లు వ్యవహరిస్తునట్లు రైతులు, ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా అక్రమ మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులకు తెలిపిన నిమిషాల వ్యవధిలోనే సమాచారం ఇచ్చిన వారికి నాయకులు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో అక్రమ మట్టి తవ్వకాలపై రైతులు, ప్రజలు అధికారులకు చెప్పడానికి ముందుకు రావడం లేదు. మండలంలోని అమిలేపల్లె చెరువులో ఎక్స్‌కవేటర్‌ను ఉంచి మూడు రోజులుగా మట్టిని తవ్వేస్తున్నారు. ఈ మట్టిని శెట్టివారిపల్లె పంచాయతీ బొడ్డువారిపల్లె బస్టాప్ సమీపంలోని ఓ పొలంలోకి తోలి చదును చేస్తున్నారు. ఇప్పటికే మట్టి మాఫియా వందలాది టిప్పర్లతో వందలాది లోడ్ల మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు. మూడు రోజులుగా మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు, రైతులు సమాచారమిచ్చిన పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై అమిలేపల్లె వీఆర్వో మునిస్వామినాయక్ వివరణ కోరగా చెరువులో మట్టి తవ్వుతున్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. చెరువు వద్దకు వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బొడ్డువారిపల్లె వద్ద చెరువులో మట్టితో చదును చేస్తున్న పొలం

రైతుల సంక్షేమమే సీఎం ధ్యేయం

- నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు రూ.16 కోట్లు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి





చెక్కును అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మంత్రితో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కురబలకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అంగళ్లలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు రైతుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,88,408 మంది రైతులకు రూ.126.60 కోట్లు అందజేశామన్నారు. రాయచోటికి రూ.26 కోట్లు, పీలేరుకు రూ.25 కోట్లు, రైల్వేకోడూరుకు రూ.16 కోట్లు, రాజంపేటకు రూ.14 కోట్లు, మదనపల్లెకు రూ.13 కోట్లు, అత్యధికంగా తంబళ్లపల్లెకు రూ.30 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసకర పాలనతో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. గతంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటిని పూర్తి స్థాయిలో రూ.1081 కోట్లతో మరమ్మత్తులు చేపట్టామన్నారు. కాగా ప్రతి నియోజకవర్గానికి రోడ్ల నిర్మాణాలకు రూ.16 కోట్లు నిధులు కేటాయించామని త్వరలోనే టెండర్లను పిలిచి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, ఎన్విరాన్‌మెంటల్ చైర్మెన్ దినేష్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్, హార్టికల్చర్ పీడీ లక్ష్మీప్రసన్న, ములకలచెరువు సింగిల్ విండో చైర్మన్ త్యాగరాజు, ఎంపీడీవో గంగయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ తపశ్విని, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మల్లికార్జుననాయడు, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, అయూబ్ బాషా, వైజి.రమణ, వైజి సురేంద్ర, రుద్రబాల కృష్ణ, శెట్టి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సమావేశం

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు రైతుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా జరిగింది. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడిని వేదికపైకి ఆహ్వానించారు. దీంతో మరో వర్గానికి చెందిన నాయకులు ప్రోటోకాల్ లేని అతడిని వేదికపై నుంచి దించాలని మంత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొంతసేపు గందరగోళం చోటు చేసుకుంది. అనంతరం మంత్రి కలుగజేసుకుని అయనను వేదికపై నుంచి వెళ్లాలని కోరగా కిందికి వచ్చేశారు. ఆయన ఆందోళనకు గురవడంతో అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. దీంతో ఆయనను అనుచరులు మదనపల్లెలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయనను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు తదితరులు పరామర్శించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వర్గాలు వీడి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డిసెంబరు రెండో వారంలో కార్యకర్తల అభీష్టం మేరకు మంచి నాయకుడిని నియమిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు ఆయన ప్రసంగానికి అడ్డుతగలబోగా మధ్యలోనే సమావేశం ఆపేసి వెళ్లిపోయారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంగా రాఘవరెడ్డి, గుడే శ్రీనివాసులు, తిమ్మరాయుడు, బొగ్గు భాస్కర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో ఆలయాల నిర్మాణం

దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథం



రామాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖాధికారులు

గాలివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో శ్రీవాణి ట్రస్టు ద్వారా దళితవాడలు, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథం తెలిపారు. బుధవారం పూలుకుంట గ్రామం మంగళపల్లి, రెడ్డివారిపల్లె, వడ్డెపల్లెల్లో దేవాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసిన గ్రామాల్లో మొదటి దశలో స్థలాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. స్థలాల పరిశీలన అనంతరం దేవాలయాల నిర్మాణం కోసం వాటి మంజూరు కొరకు దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదికలను పంపుతామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏఈ రవితేజ, సర్పంచ్ పార్థసారధిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రెవెన్యూ శాఖ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పట్టాదారు పాస్‌పుస్తకాలు, మ్యుటేషన్ సేవలు పారదర్శకంగా అందించడంతో పాటు వీటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్లోచార్ట్‌ల ప్రకారం దరఖాస్తుల ప్రక్రియ గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ల నుంచి ప్రారంభమయ్యేలా మండలాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ రెడ్డెన్న, ఎంఆర్ఐ రాజేశ్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి సన్నిధిలో ఏపీజీబీ చైర్మన్



ఏపీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామిని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ స్వారో, నందలూరు బ్యాంకు మేనేజర్ కల్యాణి, ఫీల్డ్ ఆఫీసర్ జాహ్నవిదర్, సౌమ్యనాథసేవా ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, అన్నదాన ట్రస్టు సభ్యుడు చక్రాల సాయినాథ్‌కుమార్, శ్రీనివాసులు, శివయ్య, వరదయ్య పాల్గొన్నారు.

మద్దయ్యగారిపల్లెలో గొర్రెల దొంగలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ దొంగల ముఠా సినీ ఫక్కీలో బొలెరో వాహనంలో వచ్చి గొర్రెలను తీసుకెళ్లిపోయారు. గ్రామస్థులు అందించిన వివరాల మేరకు మద్దయ్యగారిపల్లె వాసి కొత్తోళ్ల ఆదినారాయణ గొర్రెలు మేపుతూ జీవనం సాగించేవాడు. మంగళవారం సాయంత్రం గొర్రెలను తమ ఇంటి పక్కనే గొర్రెల దొడ్డికి తోలి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గొర్రెల దొడ్డిలో అలజడి కావడంతో అక్కడికి వెళ్లి చూడగా బొలెరో వాహనంలో వచ్చిన కొందరు దొంగలు గొర్రెల మందలోని నాలుగు గొర్రెలను వాహనంలో ఎక్కించేశారు. ఆదినారాయణ గట్టిగా కేకలు వేసి పరుగున వాహనం వద్దకు వెళ్లడంతో ఒక్కసారిగా వాహనాన్ని అక్కడి నుంచి వేగంగా పోనివ్వడంతో అందులోంచి ఒక్క గొర్రె కిందికి దూకేసింది. మిగిలిన మూడు గొర్రెలతో దొంగలు ఉడాయించారు. నిత్యం రద్దీగా ఉండే మద్దయ్యగారిపల్లెలో ఇలాంటి సంఘటనలు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుర్రంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నడుస్తూ వెళుతున్న క్రిష్టప్ప((72)ను టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... గుర్రంకొండ పట్టణం రామకృష్ణారెడ్డినగర్ వాసి క్రిష్టప్ప ఇంటి నుంచి బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా చెర్లోపల్లె నుంచి గుర్రంకొండకు వస్తున్న టాటా ఏస్ వాహనం ఎస్‌బీఐ సమీపంలో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో బాధితుడి తలకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళుతుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మహబూబ్‌బాషా (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహబూబ్ బాషా (35) అనే వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం చీకటిగుట్ట వాసి మహబూబ్ బాషా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తన భార్య చోటి జాన్ గొడవపడడంతో మనస్తాపానికి గురై రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

బుధవారం ఉదయం భార్య నిద్రలేచి చూడగా శవమై కనిపించాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. టూటౌన్ సీఐ రాజారెడ్డి ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూన్నాళ్ల ముచ్చటేనా...!

- పాడైపోయిన డైట్ పార్కు
- చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయిన గ్రావెల్
- రూ.కోట్లు పెట్టి కట్టి గాలికి వదిలేశారు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



డైట్ మున్సిపల్ పార్కు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ చేస్తూ ఆనందంగా గడుపుతున్న రాయచోటి వాసులకు ఇటీవల వచ్చిన వర్షం పుణ్యమా అని ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల డైట్ పార్క్ పాడైపోయింది. పార్కు ఏర్పాటు చేసినప్పుడు ఇక్కడి ప్రజలు ఎంతో ఆనందపడ్డారు. ఐదు సంవత్సరాల చిన్నపిల్లవాడి దగ్గర నుంచి 75 ఏళ్ల వృద్ధుడి వరకు దాదాపు అందరూ పార్కులో ఉదయం, సాయంత్రం మంచి వాతావరణలో వాకింగ్ చేస్తూ ఆనందంగా గడిపేవారు. అయితే ఈ ఆహ్లాదరకమైన వాతావరణం డైట్ పార్కులో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. రెండు వారాల క్రితం పడిన వర్షానికి ట్రాక్ మీద వేసిన గ్రావెల్ మొత్తం కొట్టుకుపోయి లైటింగ్ మొత్తం పాడైపోయి ఎక్కడికక్కడ చెట్లు విరిగిన పరిస్థితి డైట్ పార్కులో దర్శనమిస్తోంది. దాదాపు కోటి 53 లక్షలతో లక్షలతో నిర్మించిన ఈ పార్కు ఒకప్పుడు డైట్ హాస్టల్ ప్రాంగణంగా ఉండేది. అంతేగాక ఈ పార్కులో వేసిన ట్రాక్ పక్కన ఉన్న షెల్టర్ల కింద కొంతమంది మద్యం తాగి ఎక్కడపడితే అక్కడ బాటిళ్లు పారవేస్తున్నారు. దీనివల్ల పార్కుకు రావడానికి మహిళలు భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ పార్కుపై దృష్టి పెట్టి ఈ పార్కులో మంచి వాతావరణం ఉండేటట్లు చూస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రవిని వివరణ కోరగా నేను వచ్చిన తర్వాత రెండు సార్లు డైట్ పార్కును సందర్శించాను. అక్కడే చిన్న చిన్న సమస్యలు ఉన్నది వాస్తవమే. పార్కులో ఏమేమి అవసరమో నేను వెళ్లి ఒకసారి చూసి తర్వాత చర్యలు తీసుకుంటాం.



పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డు పగలగొట్టిన దృశ్యం



నడక దారిలో పైకి తేలిన రాళ్లు

పట్టించుకునే వారే లేరు



పార్కు ఏర్పాటు చేసిన కొత్తలో కొంత బాగానే ఉండేది. అప్పుడు ఉదయం, సాయంత్రం పోలీసు వారు కూడా పర్యవేక్షిస్తూ ఉండేవారు. కొంతకాలంగా ఈ పార్కును మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు పార్కు మొత్తం పాడైపోయి గ్రావెల్ కొట్టుకుపోయి రాళ్లు బయటప డ్డాయి. వ్యాయామం చేసే పరికరాలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. లైటింగ్ కూడా అంతంత మాత్రమే ఉంది. ఉదయం, సాయంత్రం మహిళలు ఈ పార్కులో వాకింగ్ చేయడానికి భయపడుతున్నారు. ఆకతాయిలు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పార్కులో ఉండి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ పార్కుపై దృష్టి పెట్టి అసాంఘిక వ్యక్తులను రానివ్వకుండా ఉంటే బాగుంటుంది.

-పురుం రెడ్డెయ్య, రాయచోటి

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ప్రతి ఒక్కరి పనితీరు నివేదిక నా దగ్గర ఉంది
- కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు

(కడప - ఆంధ్రజ్యోతి): మళ్లీ మనం గెలవాలన్నా మనం.. అధికారంలోకి రావాలన్నా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు నిత్యం ప్రజల్లో ఉండాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కార్యకర్తల సమస్యలను సావధానంగా వినాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. బుధవారం సాయంత్రం పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరులో కమలాపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నెలా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలని, నేను ఏదో ఒక జిల్లాలో ప్రతి నెలా పాల్గొంటున్నానని, ప్రతి సోమవారం పార్టీ ఆఫీసుకు వెళ్లి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరెవరు పనిచేస్తున్నారో అందరి పనితీరు జాబితా నా వద్ద ఉందని, మైనార్టీల్లో మనకు ఓటింగ్ బాగా పెరిగిందని, తల్లికి వందనం పథకం మంచి మేలు చేసిందని, ఉచిత బస్సుతో పార్టీ పట్ల మహిళల ఆదరణ బాగుందని తెలిపారు. అందుకే ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పుత్తా చైతన్యరెడ్డి బాగా కష్టపడుతున్నారని, మంచి పేరుందని, అయితే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రాధాన్యతాపరంగా నిధులు విడుదల చేస్తానని వెల్లడించారు. ఈనెల చివరి నాటికి క్లస్టర్ మండల పదవులు భర్తీ చేస్తామని, ఎన్నికల్లో బద్వేలు, పులివెందుల గెలవలేకపోయామని, ఈసారి అక్కడ ప్రత్యేక దృష్టి పెట్టి అక్కడ గెలిచేందుకు గట్టిగా కృషి చేస్తామని తెలిపారు. కమలాపురం నియోజకవర్గానికి రాష్ట్రస్థాయి పదవులు రెండు మాత్రమే వచ్చాయని, మరిన్ని పదవులు కావాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇంకా పలు సమస్యలను ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు.



పెండ్లిమర్రిలో మన గ్రోమోర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



టమోటా తోట వద్ద మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు

డ్రోన్‌తో మందుల పిచికారీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి





డ్రిప్‌ను పరిశీలిస్తూ...



పెండ్లిమర్రిలో మంత్రి అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

శివాలయంలో ఘనంగా లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు



వెండి ముఖావాడ, నాగాభరణంతో దర్శనం ఇస్తున్న నరసింహస్వామి

పెద్దతిప్పసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీకమాసం చివరి రోజున ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు బెంగళూరుకు చెందిన వేదపండితులచే లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు లండన్‌లో ఉన్న ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య కుమారుడు సనగరం లక్ష్మీనరసింహాశర్మ, సాయికృష్ణ, శ్వేత దంపతులు ఆలయానికి రూ.6 లక్షల విలువైన వెండి ముఖావాడ, వెండి నాగాభరణములను ఆలయానికి బహూకరించారు. వారు అందించిన ముఖావాడ, నాగాభరణాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అలంకరించారు. కార్తీకమాసం చివరి రోజు కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 69వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలను బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని తెలిపారు.

ఇక్కడే కాకుండా చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్‌లో కూడా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు డాక్టర్ ఎస్.బాబు, నాగరాజా, మురళీధర్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని పరిశీలకులు తెలిపారు. కార్యక్రమంలో చంద్రమాకులపల్లె హెచ్‌ఎం, గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ రంగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోల జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే డిప్యూటీ ఎంపీడీవోల జిల్లా నూతన కమిటీని బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 30 మండలాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవోలు సమావేశానికి హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా టి.సురేశ్‌బాబు (రాయచోటి డిప్యూటీ ఎంపీడీవో), జనరల్ సెక్రటరీగా సి.రాంమోహన్‌రెడ్డి (ఓబులవారిపల్లె డిప్యూటీ ఎంపీడీవో), ట్రెజరర్‌గా టి.భారతి (మదనపల్లె డిప్యూటీ ఎంపీడీవో), వైస్ ప్రెసిడెంట్‌గా సి.అష్రఫ్‌వలి (రాజంపేట, డిప్యూటీ ఎంపీడీవో)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు హాల్‌టిక్కెట్లు

రాజంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నారంరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఇందుకు సంబంధించిన హాల్‌టిక్కెట్లను కూడా విడుదల చేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికల చదువు, బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిక అధికారి హైమావతి తెలిపారు. బుధవారం చెన్నముక్కపల్లె, సుండుపల్లె రోడ్డు నారాయణ ఫంక్షన్ హాల్‌లో బేటీ బచావో, బేటీ పఢావో పథకంపై గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు జిల్లా స్థాయి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంపై గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆడ, మగ సమానత్వం అనేది మన ఇంటి నుంచే మొదలు పెట్టాలని, అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఆడపిల్లల మీద ఉన్న అపోహలను తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలను చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ ఏటీవో జయలక్ష్మి, జీఎస్‌డబ్ల్యుఎస్ డిపార్టుమెంట్ డీడీవో లక్ష్మీపతి, సీడీపీవో శశికళ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వినోద్‌కుమార్, సూపర్‌వైజర్లు, మహిళా కార్యదర్శి జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, శిశు గృహ సిబ్బంది, వన్‌స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీపీపీకి ఎమ్మెల్యేల కమిటీ


ఎర్రగుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటైన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ గురువారం ఆర్టీపీపీకి వస్తోంది. బుధవారం రాత్రి విజయవాడలో ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి గురువారం తెల్లవారుజామున ప్రొద్దుటూరులో దిగి రాయల్‌కౌంటిలో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 11గంటలకు ఆర్టీపీపీకి వస్తారు. ప్లాంటులో పర్యటిస్తారు. అనంతరం ఆర్టీపీపీ అధికారులతో సమావేశం అవుతారు. 12 మంది ఎమ్మెల్యేలతో కూడిన ఈ కమిటీ ఆర్టీపీపీ గురించి రివ్యూ చేస్తారు. ఇందు కు సంబంధించి ఆర్టీపీపీ సీఈ వాసు దేవరావు ఆధ్వర్యంలో కమిటీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం అనంతరం వారు గండికోటకు బయలు దేరి వెళతారని, అక్కడి నుంచి కడపకు వెళ్లి అక్కడ జరిగే రివ్యూల్లో పాల్గొంటారు.

మనసు పరవశించచనే...

- కనువిందు చేస్తున్న జలసవ్వడులు
- గంగ ఎస్ఆర్-1 పరిసరాలు ఆహ్లాదం


పాల నురుగలా జాలువారుతున్న గంగ నీటి ప్రవాహం

దువ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్ద ఉన్న తెలుగుగంగ సబ్సిడరీ-1 పరిసరాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా రిజర్వాయర్-1లోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నిండుకుండలా దర్శనమిస్తున్న రిజర్వాయర్ చూపరులకు ముచ్చట గొలిపిస్తోంది. హెడ్ రెగ్యులేటర్ ద్వారా దిగువనున్న చెన్నముక్కపల్లె కాలువకు నీరు వెళుతున్న దృశ్యాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఎడమవైపు నుంచి నీరు వెళుతూ చెన్నముక్కపల్లె కాలువలోకి దూకే సమయంలో నురగలు కక్కుతూ ముచ్చట గొలుపుతున్నాయి. కుడివైపునున్న రంధ్రం నుంచి జాలువారుతున్న జలాలు ఆకర్షిస్తున్నాయి. ఇక్కడే హుడా నిధులతో పార్కును ఏర్పాటు చేశారు. అందులో పర్యాటకులు సేదతీరుతూ కాలక్షేపం చేస్తుంటారు. ఆదివారం ఆటవిడుపుగా ఇక్కడకు జనాలు వస్తుంటారు. ఈ ప్రాంతంలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్‌లోకి దిగవద్దని బోర్డులు రాసి ఉంచారు. ఈ తరహా నిబంధనలు పర్యాటకులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హెడ్‌రెగ్యులేటర్‌కు కొంత ముందుకెళుతూ కుడివైపున గోశాల ఏర్పాటు చేశారు. ఇందులో ఆవులను పెంచుతూ సంరక్షిస్తున్నారు.


హెడ్ రెగ్యులేటర్ సొరంగం నుంచి కిందకు దూకుతున్న గంగ జలాలు

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి

- జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ యామిని

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమె జాతీయ లోక్ అదాలత్ ముందస్తు సమావేశం వర్చువల్‌గా నిర్వహించారు. డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న కేసులపై ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, పిటీషనర్ ఎంవీఓపీ అడ్వకేట్లు, చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమంలో రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్, కడప నాల్గవ అదనపు జిల్లా జడ్జి జి.దీనాబాబు, ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.రమేష్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : వీసీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ సూచించారు. నెట్, జేఆర్ఎఫ్ అర్హత సాధించిన విద్యార్థులకు దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో యూజీసీ నెట్, ఏపీసెట్, సీఎస్ఐఆర్, నెట్ కోచింగ్ తరగతులను ప్రారంభించారు. ఈ కోచింగ్ ద్వారా పేపర్-1 పూర్తి సిలబస్‌ను నిపుణులైన అధ్యాపకులు బోధించనున్నారు. అలాగే విద్యార్థుల సందేహాలను తీర్చడానికి ప్రత్యేక డౌట్- క్లారిఫికేషన్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ కోచింగ్ ఎంతో ప్రయోజనకరమన్నారు. నెట్, జేఆర్ఎఫ్ అర్హత సాధించిన వారికి దేశవ్యాప్తంగా మంచి అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా జేఆర్ఎఫ్ ద్వారా 60 నెలల పాటు నెలకు రూ.40వేల చొప్పున మొత్తం రూ.24లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయభారతి మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రఘునాథరెడ్డి, రఘునాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సతీష్ బాబు, ఈశ్వర్‌రెడ్డి, జయంత్ కశ్యప్, పరిశోధక, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సోది కాదు... సూది నారాయణరెడ్డిని


జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది

జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంపీ అవినాశ్‌రెడ్డి తనను సోది నారాయణరెడ్డి అని అహంకారంతో మాట్లాడారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇక నుంచి తాను సోది కాదని, సూది నారాయణరెడ్డి అని మీ అవినీతిని ఎప్పుడూ గుచ్చుతూనే ఉంటానన్నారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, రైతుల సమావేశం అనంతరం బయట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తాను జమ్మలమడుగులో వైసీపీ అభ్యర్థి సుధీర్‌రెడ్డిని ఓడించానన్నారు. ప్రతిపక్షంలో ఉండాల్సిన జగన్ మోహన్‌రెడ్డి ప్రతి నాయకుడిగా మారినా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. పులివెందుల ప్రజలు సున్నితమైనవారని వారిని మభ్యపెట్టి మీరు రాజకీయం పబ్బం గడుపుకుంటున్నారని చీనీలో, అరటిలో దోపిడీ చేస్తున్నారని అవినాశ్‌రెడ్డిని విమర్శించారు. వైఎస్ భారతి 400 కేజీల బంగారం కొన్నది వాస్తవం కాదా అన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌నకు వైవీయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


పర్వతారోహణ క్యాంప్‌నకు బయలుదేరిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని జాతీయ సేవా పథకం వలంటీర్లు హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి పర్వతారోహణ క్యాంప్‌నకు బుధవారం బయలు దేరివెళ్లారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి కడప రైల్వేస్టేషన్‌కి వెళ్లి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అడ్వెంచర్ క్యాంప్‌లో అద్వితీయమైన పాత్రను పోషించి విద్యాలయానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పర్వతారోహణ క్యాంప్‌నకు కంటింజెంట్ లీడర్‌గా యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.లలిత వ్యవహరిస్తున్నారు. వైవీయూ పీజీ కళాశాల, పులివెందుల ప్రభుత్వ మహిళా కళాశాల, కడప ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేఆర్అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీహరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పది మంది బయలుదేరి వెళ్లారు. పదిరోజుల పాటు జరిగే అడ్వెంచర్ క్యాంప్‌లో వీరి సాహసాలను ప్రదర్శించనున్నారు.

సహకార రంగంలో టౌన్‌బ్యాంక్‌కు ప్రత్యేక స్థానం


- జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య



చెక్కును అందజేస్తున్న జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో ప్రొద్దుటూరు కోఆపరే టివ్ టౌన్‌బ్యాంకుకు ప్రత్యేక స్థానం దక్కుతుందని జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య కొనియాడారు. బుధవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను స్థానిక కోనేటి కాల్వ వీధిలోని ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్‌లో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి సహకారశాఖ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సహకార వ్యవస్థ సమిష్టి ప్రయోజనాలను నెరవేర్చు తుందన్నారు. ముఖ్యంగా పేద మధ్య తరగతికి చెందిన వారికి సహకార రంగం ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ టౌన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, ఖాతాదారుల సంపూర్ణ సహకారంతోనే బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందన్నారు. ఈసందర్భంగా పలువురు బ్యాంకు ఖాతాదారులకు రుణాలు అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ సహకారశాఖ అధికారి సత్యానంద, జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బ్యాంకు సీఈవో నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌గౌస్, బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ పైపులైన్‌కు లీకేజీలు


వృద్ధాశ్రమం వద్ద గుంతలో నిలబడిన నీరు

చాపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ నుంచి ఆర్టీపీపీ థర్మల్ ప్రాజెక్టుకు వెళ్లే పైపులైనుకు లీకేజీలు ఏర్పడ్డాయి. చాపాడు గ్రామంలోని దిలీప్ గ్యాస్ గోడౌన్ వద్ద, కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమం సమీపంలో లీకేజీ కావడంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. బయటకు వస్తున్నాయి. దీంతో వృద్ధాశ్రమంలో నీరు నిలబడి వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం లీకేజీలను అరికట్టేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ పాయింట్లను గుర్తించలేకపోయారు. దీంతో నీరు వృథాగా పోతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఇంజనీర్లు లీకేజీలను గుర్తించి అరికట్టాల్సిన అవసరం ఉంది.


యాంటీబయాటిక్స్ అతిగా వాడితే ప్రమాదకరం



మాట్లాడుతున్న పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశువుల చికిత్సలో యాంటీబయాటిక్స్‌ను ఎక్కువగా వాడరాదని, డాక్టర్ల సూచనల మేరకే ఉపయోగించాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో వరల్డ్ ఎఎంఆర్ అవర్నెస్ వీక్‌లో భాగంగా ఐసీఏఆర్ ప్రాజెక్టు ద్వారా పశువులు, చేపలలో యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెంట్స్ గురించి వర్తమానాన్ని కాపాడుతూ భవిష్యత్తును భద్రంగా చూసుకునే స్కీంతో సెమినార్ నిర్వహించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ గన్నవరం పశువైద్య కళాశాల వైద్యుడు డాక్టర్ ఆనందప్రసాద్, పశువైద్యులు, విద్యార్థులకు యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెంట్స్ గురించి, దాని వలన కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. యాంటీ బయాటిక్స్ వాడకం వలన మనుషులు, మొక్కలు, ప్రకృతి ఆరోగ్యం ఏ విధంగా దెబ్బతింటుందో వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యులు మూగజీవాలకు వైద్యం చేసేటప్పుడు యాంటిబయాటిక్స్‌ను తగిన మోతాదులో వాడాలని సూచించారు. అతిగా వాడటం వలన దుష్పరిణామాలకు దారి తీస్తుందన్నారు. కళాశాల ఏఎస్‌వో డాక్టర్ రాజాకిశోర్, సూక్ష్మశాస్త్ర విభాగం ప్రొఫెసర్ విజయలక్ష్మిలు యాంటీబయాటిక్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోస్టర్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


వెంకటరామయ్య (ఫైల్)

మైదుకూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వని పెంట గ్రామం లెక్కలవారిపల్లె వెళ్లే రోడ్డులో బుధవారం సాయం త్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముక్కమల్ల వెంకటరామయ్య (66) అనే వ్యక్తి మృతి చెందాడు. అక్కులాయపల్లెకు చెందిన వెంకట రామయ్య తమ సమీప బంధువు అనారోగ్యంతో ఉంటే పరామర్శించేందు కు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మైదుకూరుకు చెందిన ఓ కాలేజీ బస్సు అతన్ని వెనక వైపు నుంచి ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీ, బేల్దారి పనులు చేసుకొని జీవనం సాగించే వెంకటరామయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తెకు భర్త మరణించడంతో ఆమెను, ఆమె పిల్లలను ఈయనే పోషించేవారు. అకస్మాత్తుగా కుటుంబ పెద్ద మృత్యువాత పడడంతో భార్య పిల్లలు అనాథలయ్యారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అన్నదాతకు మహర్దశ : సబ్ కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న సబ్‌కలెక్టర్ భావన, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు

రాజంపేటటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం వల్ల ప్రతిఒక్కరికీ లాభం చేకూరుతుందని రాజంపేట సబ్‌కలెక్టర్ భావన పేర్కొన్నారు. బుధవారం రాజంపేటలో జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం వల్ల ప్రతి అన్నదాతకు ఏడాదికి రూ.10 వేల వరకు ఆర్థికసాయం లభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన లాంటి పథకాలను అనేకం ప్రవేశపెడుతుందన్నారు. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలోని అన్నదాతలకు అన్నివిధాల సహాయం చేయడంలో భాగంగా నేడు ప్రతిరైతు ఖాతాలో ఆర్థిక సహాయాన్ని వేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. పలువురికి అన్నదాత సుఖీభవ చెక్కులను అందజేశారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

రామాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు యానాది కాలనీకి ప్రభుత్వ పథకాల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తహసీల్దార్ వెంకటేశులు అన్నారు. మండలంలోని గువ్వలచెరువు పంచాయతీ పరిధిలోని యానాదికాలనీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ గ్రామాల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవని, తమకు అన్ని సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందేవిధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మత్‌ఖాన్, టీడీపీ నాయకులు హరిప్రసాద్, ఆజాంబాషా, దుర్గాప్రసాద్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ కర్తవ్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించగా వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.

చిన్నమండెం: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని బుధవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమంలో వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, అధికారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే అధికారులను ఆదేశించారు.



ప్రజా సమస్యలను ఫోన్ ద్వారా అధికారులకు వివరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పట్టణాభివృద్ధికి అధికారులు సహకరించండి: చమర్తి

రాజంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు సహకరించాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సూచించారు. బుధవారం టీడీపీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు. మున్సిపాలిటీకి చేరుకున్న చమర్తి జగన్‌మోహన్‌రాజును టీడీపీ నేతలు, అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుతో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యలను, అధికారులను పారదర్శకంగా పరిష్కరించి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య సమస్య, రోడ్ల వెడల్పు, పట్టణ సుందరీకరణ, కూరగాయల మార్కెట్ అభివృద్ధి, అండర్ డ్రైనేజీ వ్యవహారాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. టీడీపీ నాయకులు సూచించిన పనుల పట్ల అధికారులు అలసత్వం వహిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సుధాకర్, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడరు అశోక్, కౌన్సిలర్ సుధాకర్, చిన్నా, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లు రెడ్డయ్యనాయుడు, మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, చిన్నయ్య, మాజీ అధ్యక్షుడు సంజీవరావు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జగన్‌మోహన్‌రాజు

రైతులకు కూటమి ప్రభుత్వం చేయూత

● డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్



రైతులకు చెక్కును అందజేస్తున్న డీసీఎం

రైల్వేకోడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం చేయూతనిస్తోందని డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు రెవెన్యూ శాఖ కార్యాలయం సభాభవనంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద లబ్ధి చెందుతున్న రైతులతో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసి చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను గత ప్రభుత్వాలు ఎప్పుడు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మేలు చేస్తోందని తెలిపారు. అనంతరం రైల్వేకోడూరు వ్యవసాయశాఖ సంచాలకుడు పీఎస్. మణి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, కూటమి నాయకులు కొమ్మా శివ, గడికోట సుబ్బరాయుడు, కిసాన్ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణవర్మ, ఐదు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రాము



రాము

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం సీఎస్ఐ, జేసీఎం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన మాల మహానాడు రాష్ట్ర మహాసభల కార్యక్రమంలో మండలంలోని నందలూరు గ్రామానికి చెందిన మోడపోతుల రామును మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, దళిత రత్న డాక్టర్ యనమల సుదర్శన్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ

పెనగలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టవారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న మారుమూల మల్లాలమ్మదిన్నె ఎస్టీకాలనీలో ప్రత్యేక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు చక్రంపేట క్లస్టర్ ఇన్‌చార్జి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణ బుధవారం క్రీడా సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంచుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో జగ్గంపేట ఉన్నత పాఠశాల పీడీ షబాన, మల్లాలమ్మదిన్నె పాఠశాల ఉపాధ్యాయురాలు వాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అయ్యప్పమాలధారులు

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో అయ్యప్ప స్వామివారి గ్రామోత్సవం మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా, కోలాటాల నడుమ బుధవారం రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో గణపతి హోమం, అయ్యప్ప మూలమంత్రం, అనంతరం అయ్యప్పస్వామివారికి అష్టాభిషేకం నిర్వహించారు. గ్రామోత్సవంలో పెద్దఎత్తున మహిళలు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలు గురుస్వామి, గురుస్వాములు తోట శివశంకర్, సుధాకర్, మురళీ, కుమార్, ఎల్లయ్య, రమేష్, జనార్ధన్‌రెడ్డి, జయకుమార్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం: సబ్‌కలెక్టర్

రాజంపేటటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు విలువైన సేవలందిస్తూ దేశంలోనే రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ బ్యాంకు నిలవడం అభినందనీయమని సబ్‌కలెక్టర్ భావన పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం సభాభవనంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో సైతం వినియోగదారుడికి విస్తృత సేవలు అందించే ఏకైక బ్యాంకు అని తెలిపారు. అనంతరం ఏపీజీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 5 లక్షల వినియోగదారులే లక్ష్యంగా పనిచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం 20 మందికి గృహ రుణాలు, 4 వాహనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ స్వారో, ఏపీజీబీ నాబార్డు డీడీఎం విజయవిహారి, జనరల్ మేనేజర్ బిధుభూషణ్ లంక, అన్నిశాఖల బ్రాంచ్ మేనేజర్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక



బీజేపీలో చేరిన నేతలతో సాయిలోకేష్

రాజంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలువురు పెనగలూరు మండల నాయకులు బుధవారం బీజేపీ పార్టీలో చేరారు. రాజంపేట బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆ పార్టీ నేత బుజ్జమ్మ పిలుపు మేరకు ఓబిలి గ్రామానికి చెందిన నాయకులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సునీత, మహిళా మోర్చ ఇన్‌ఛార్జి ఆదిలక్షుమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణ, పెనగలూరు మండల అధ్యక్షులు రెడ్డికృష్ణ, ప్రధాన కార్యదర్శి గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ క్రీడల్లో మొదటి బహుమతి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఓం.ప్రసన్న, అరవింద్‌లు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్నారని ప్రిన్సిపల్ వరాల రమేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఎంపికై ఈ నెల 15, 16, 17వ తేదీల్లో రాష్ట్ర స్థాయి రైల్వేకోడూరులో జరిగిన బేస్‌బాల్‌లో పై ఇద్దరు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే డి.చందన కబడ్డీలో రాష్ట్ర స్థాయిలో అండర్-19లో ఎంపికయ్యారు. వీరికి ప్రశంసాపత్రాలు, కప్ అందజేశారు. కాగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్, పీడీ సోమశేఖర్‌నాయక్‌లు విద్యార్థులను అభినందించారు.

పౌష్టికాహారాన్ని అందించాలి : ఎంపీడీవో

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రీస్కూల్‌లో చదువుతున్న చిన్నారులకు పౌష్టికాహారాన్ని ఖచ్చితంగా అందించాలని ఎంపీడీవో రెడ్డెయ్య పేర్కొన్నారు. బుధవారం పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లు సమయపాలన పాటించి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు సకాలంలో అందించాలన్నారు. అలాగే పాలు, గుడ్లు, బాలామృతం, ఆకుకూరలు గర్భవతులకు ఖచ్చితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

● పలు సమస్యలపై ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు

సిద్దవటం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన రసాభాసగా జరిగింది. ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై ప్రశ్నించారు. వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాని మండల సర్వసభ్య సమావేశం ఎందుకని పెద్దపల్లె ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, ఎంపీడీవో ఫణిరాజకుమారిని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎంపీడీవో సర్పంచ్, పంచాయతి కార్యదర్శి నోటీసులు జారీ చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఎంపీటీసీలు సుబ్బమ్మ, దారపునేని లక్ష్మీదేవి, రమాదేవి, డేరంగుల శివయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకు పోరాటం

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు



దీక్షలో పాల్గొన్న నాగోతు రమేష్‌నాయుడు తదితరులు

రాజంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి ప్రాణ, ఆస్తి నష్టం జరిగి బుధవారం నాటికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రాజెక్టు తెగిపోయినప్పుడు మృతిచెందిన వారికి నాగోతు సంతాపం వ్యక్తం చేస్తూ సంఘీభావ దీక్షను బీజేపీ నేతలతో కలిసి నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధితులకు మద్దతుగా సంఘీభావ దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ జహీర్‌ఖాన్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కృష్ణయాదవ్, మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, జిల్లా కన్వీనర్ జగదీశ్వర్, రాష్ట్ర దళితమోర్చ కార్యవర్గ సభ్యుడు రమణయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతి

రాజంపేటటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తి కాకపోవడం పట్ల రైల్వే సహాయమంత్రి సోమన్నకు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. దాదాపు పదేళ్లుగా ఈ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని. 80 శాతం పనులు పూర్తయ్యాయని అయితే కొన్ని సాంకేతిక సమస్యలు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ అండర్‌బ్రిడ్జి పనులు పూర్తి కాలేదని మంత్రికి తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

రైల్వేకోడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని భుజంగేశ్వరుడు, భువనేశ్వరి దేవి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, ధూర్జటి యోగీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తులకు నీటి వసతి

సుండుపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సుండుపల్లె శివాలయంలో దాతల దాతృత్వంతో భక్తులకు నీటి వసతి ఏర్పడింది. సుండుపల్లెలో సప్తగిరి షామియానా డెకరేషన్స్ నిర్వహిస్తున్న ప్రకాశ్, మరో దాత బండకాడ ఈడిగపల్లెకు చెందిన ఈశ్వరయ్యలు ఆలయంలో నీటి నిల్వ కోసం తొట్టిని నిర్మించి నీటి సరఫరా కోసం పైపులైన్ ఏర్పాటు చేశారు. దీంతో పలువురు భక్తులు దాత ప్రకాశ్‌ను అభినందించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి



రాయచోటిటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టమోటా, బొప్పాయి, మామిడి రైతులు వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు, తుఫానులతో తీవ్రంగా నష్టపోయారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు జిల్లాలోని ఆదోనిలో జరిగిన రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ఒంటిమిట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్టలో అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. స్థానిక బజారు వీధిలో బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి భజన కార్యక్రమం నిర్వహించారు. అరటి బోదెలతో గుడిని నిర్మించారు. మండల పురోహితులు మధుమూర్తి సంప్రదాయబద్దంగా అయ్యప్పస్వామి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతుల ఖాతాలో నగదు జమ

● రూ.3.54 కోట్లు విడుదల

ఓబులవారిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాగా రైతుల ఖాతాలకు జమ చేస్తుందని మండల వ్యవసాయాధికారిణి మల్లిక తెలిపారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా మండల పరిధిలోని 5269 మందికి రూ.3.54 కోట్ల నిధులను జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

23న ఉచిత కంటి వైద్యశిబిరం

రైల్వేకోడూరురూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూలు ఆవరణంలో ముక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో కంటిచూపు పరీక్ష, కంటి సమస్యలపై నిపుణుల సలహాలు, ఉచితంగా కళ్లజోళ్లు తదితర సేవలను వైద్యులు అందిస్తారని తెలిపారు.

రాష్ట్ర యోగాసన పోటీలకు ఎంపిక

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న శ్రీమన్నారాయణ రాష్ట్ర స్థాయి యోగాసనం పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమేశ్, పీడీ వెంకట్రమణలు తెలిపారు. ప్రకాశం జిల్లా బాపట్లలో ఈ నెల 29న జరిగే యోగాసన పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

'మా ప్రభుత్వం.. రైతుల పక్షపాతి'

సిద్దవటం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఒక్కో లబ్ధిదారునికి రూ.7 వేలు జమ కావడంతో తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని నిరూపించుకుందని మండల అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని పోలీసులైను క్రాస్ వద్ద బుధవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదల సందర్భంగా ప్రతిరైతుకు లబ్ది చేరే విధంగా రెండో విడతగా కేంద్రం రూ.2 రాష్ట్ర ప్రభుత్వం 5 వేలు కలిపి ప్రతి రైతు అకౌంట్‌లో రూ.7 వేలు నగదు జమ చేయడంపై రాష్ట్ర అభివృద్ధి నేత, రైతుల పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రాజశేఖర్, యువనేత అక్కిశెట్టి మణి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో కార్తీక వనభోజనం

రాయచోటిటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చరణల మధ్య రాయచోటి- రాజంపేట మార్గంలోని ఓదివీడు కస్పాకు సమీపంలో మాండవ్య నది ఒడ్డున వెలసిన శివరామాలయంలో కార్తీక వన మహోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం మాండవ్యనదికి జలహారతి ఇచ్చారు. ఈ వనభోజన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం వనభోజన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దళిత కాలనీల్లో ఆలయాల నిర్మాణం

దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథం



రామాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖాధికారులు

గాలివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో శ్రీవాణి ట్రస్టు ద్వారా దళితవాడలు, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథం తెలిపారు. బుధవారం పూలుకుంట గ్రామం మంగళపల్లి, రెడ్డివారిపల్లె, వడ్డెపల్లెల్లో దేవాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసిన గ్రామాల్లో మొదటి దశలో స్థలాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. స్థలాల పరిశీలన అనంతరం దేవాలయాల నిర్మాణం కోసం వాటి మంజూరు కొరకు దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదికలను పంపుతామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏఈ రవితేజ, సర్పంచ్ పార్థసారధిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రెవెన్యూ శాఖ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పట్టాదారు పాస్‌పుస్తకాలు, మ్యుటేషన్ సేవలు పారదర్శకంగా అందించడంతో పాటు వీటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్లోచార్ట్‌ల ప్రకారం దరఖాస్తుల ప్రక్రియ గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ల నుంచి ప్రారంభమయ్యేలా మండలాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ రెడ్డెన్న, ఎంఆర్ఐ రాజేశ్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి సన్నిధిలో ఏపీజీబీ ఛైర్మన్



ఏపీజీబీ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామిని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ స్వారో, నందలూరు బ్యాంకు మేనేజర్ కల్యాణి, ఫీల్డ్ ఆఫీసర్ జాహ్నవిదర్, సౌమ్యనాథసేవా ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, అన్నదాన ట్రస్టు సభ్యుడు చక్రాల సాయినాథ్‌కుమార్, శ్రీనివాసులు, శివయ్య, వరదయ్య పాల్గొన్నారు.

మద్దయ్యగారిపల్లెలో గొర్రెల దొంగలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ దొంగల ముఠా సినీ ఫక్కీలో బొలెరో వాహనంలో వచ్చి గొర్రెలను తీసుకెళ్లిపోయారు. గ్రామస్థులు అందించిన వివరాల మేరకు మద్దయ్యగారిపల్లె వాసి కొత్తోళ్ల ఆదినారాయణ గొర్రెలు మేపుతూ జీవనం సాగించేవాడు. మంగళవారం సాయంత్రం గొర్రెలను తమ ఇంటి పక్కనే గొర్రెల దొడ్డికి తోలి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గొర్రెల దొడ్డిలో అలజడి కావడంతో అక్కడికి వెళ్లి చూడగా బొలేరో వాహనంలో వచ్చిన కొందరు దొంగలు గొర్రెల మందలోని నాలుగు గొర్రెలను వాహనంలో ఎక్కించేశారు. ఆదినారాయణ గట్టిగా కేకలు వేసి పరుగున వాహనం వద్దకు వెళ్లడంతో ఒక్కసారిగా వాహనాన్ని అక్కడి నుంచి వేగంగా పోనివ్వడంతో అందులోంచి ఒక్క గొర్రె కిందికి దూకేసింది. మిగిలిన మూడు గొర్రెలతో దొంగలు ఉడాయించారు. నిత్యం రద్దీగా ఉండే మద్దయ్యగారిపల్లెలో ఇలాంటి సంఘటనలు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుర్రంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నడుస్తూ వెళుతున్న క్రిష్టప్ప((72)ను టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... గుర్రంకొండ పట్టణం రామకృష్ణారెడ్డినగర్ వాసి క్రిష్టప్ప ఇంటి నుంచి బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా చెర్లోపల్లె నుంచి గుర్రంకొండకు వస్తున్న టాటా ఏస్ వాహనం ఎస్‌బీఐ సమీపంలో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో బాధితుడి తలకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళుతుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మహబూబ్‌బాషా (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహబూబ్ బాషా (35) అనే వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం చీకటిగుట్ట వాసి మహబూబ్ బాషా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తన భార్య చోటి జాన్ గొడవపడడంతో మనస్థాపానికి గురై రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

బుధవారం ఉదయం భార్య నిద్రలేచి చూడగా శవమై కనిపించాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. టూటౌన్ సీఐ రాజారెడ్డి ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూన్నాళ్ల ముచ్చటేనా...!

- పాడైపోయిన డైట్ పార్కు
- చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయిన గ్రావెల్
- రూ.కోట్లు పెట్టి కట్టి గాలికి వదిలేశారు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



డైట్ మున్సిపల్ పార్కు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ చేస్తూ ఆనందంగా గడుపుతున్న రాయచోటి వాసులకు ఇటీవల వచ్చిన వర్షం పుణ్యమా అని ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల డైట్ పార్క్ పాడైపోయింది. పార్కు ఏర్పాటు చేసినప్పుడు ఇక్కడి ప్రజలు ఎంతో ఆనందపడ్డారు. ఐదు సంవత్సరాల చిన్నపిల్లవాడి దగ్గర నుంచి 75 ఏళ్ల వృద్ధుడి వరకు దాదాపు అందరూ పార్కులో ఉదయం, సాయంత్రం మంచి వాతావరణలో వాకింగ్ చేస్తూ ఆనందంగా గడిపేవారు. అయితే ఈ ఆహ్లాదరకమైన వాతావరణం డైట్ పార్కులో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. రెండు వారాల క్రితం పడిన వర్షానికి ట్రాక్ మీద వేసిన గ్రావెల్ మొత్తం కొట్టుకుపోయి లైటింగ్ మొత్తం పాడైపోయి ఎక్కడికక్కడ చెట్లు విరిగిన పరిస్థితి డైట్ పార్కులో దర్శనమిస్తోంది. దాదాపు కోటి 53 లక్షలతో లక్షలతో నిర్మించిన ఈ పార్కు ఒకప్పుడు డైట్ హాస్టల్ ప్రాంగణంగా ఉండేది. అంతేగాక ఈ పార్కులో వేసిన ట్రాక్ పక్కన ఉన్న షెల్టర్ల కింద కొంతమంది మద్యం తాగి ఎక్కడపడితే అక్కడ బాటిళ్లు పారవేస్తున్నారు. దీనివల్ల పార్కుకు రావడానికి మహిళలు భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ పార్కుపై దృష్టి పెట్టి ఈ పార్కులో మంచి వాతావరణం ఉండేటట్లు చూస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రవిని వివరణ కోరగా నేను వచ్చిన తర్వాత రెండు సార్లు డైట్ పార్కును సందర్శించాను. అక్కడే చిన్న చిన్న సమస్యలు ఉన్నది వాస్తవమే. పార్కులో ఏమేమి అవసరమో నేను వెళ్లి ఒకసారి చూసి తర్వాత చర్యలు తీసుకుంటాం.



పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డు పగలగొట్టిన దృశ్యం



నడక దారిలో పైకి తేలిన రాళ్లు

పట్టించుకునే వారే లేరు



పార్కు ఏర్పాటు చేసిన కొత్తలో కొంత బాగానే ఉండేది. అప్పుడు ఉదయం, సాయంత్రం పోలీసు వారు కూడా పర్యవేక్షిస్తూ ఉండేవారు. కొంతకాలంగా ఈ పార్కును మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు పార్కు మొత్తం పాడైపోయి గ్రావెల్ కొట్టుకుపోయి రాళ్లు బయటపడ్డాయి. వ్యాయామం చేసే పరికరాలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. లైటింగ్ కూడా అంతంత మాత్రమే ఉంది. ఉదయం, సాయంత్రం మహిళలు ఈ పార్కులో వాకింగ్ చేయడానికి భయపడుతున్నారు. ఆకతాయిలు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పార్కులో ఉండి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ పార్కుపై దృష్టి పెట్టి అసాంఘీక వ్యక్తులను రానివ్వకుండా ఉంటే బాగుంటుంది.

-పురుం రెడ్డెయ్య, రాయచోటి

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ప్రతి ఒక్కరి పనితీరు నివేదిక నా దగ్గర ఉంది
- కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు

(కడప - ఆంధ్రజ్యోతి): మళ్లీ మనం గెలవాలన్నా మనం.. అధికారంలోకి రావాలన్నా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు నిత్యం ప్రజల్లో ఉండాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కార్యకర్తల సమస్యలను సావధానంగా వినాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. బుధవారం సాయంత్రం పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరులో కమలాపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నెలా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలని, నేను ఏదో ఒక జిల్లాలో ప్రతి నెలా పాల్గొంటున్నాని, ప్రతి సోమవారం పార్టీ ఆఫీసుకు వెళ్లి పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరెవరు పనిచేస్తున్నారో అందరి పనితీరు జాబితా నా వద్ద ఉందని, మైనార్టీల్లో మనకు ఓటింగ్ బాగా పెరిగిందని, తల్లికి వందనం పథకం మంచి మేలు చేసిందని, ఉచిత బస్సుతో పార్టీ పట్ల మహిళల ఆదరణ బాగుందని తెలిపారు. అందుకే ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పుత్తా చైతన్యరెడ్డి బాగా కష్టపడుతున్నారని, మంచి పేరుందని, అయితే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రాధాన్యతాపరంగా నిధులు విడుదల చేస్తానని వెల్లడించారు. ఈనెల చివరి నాటికి క్లస్టర్ మండల పదవులు భర్తీ చేస్తామని, ఎన్నికల్లో బద్వేలు, పులివెందుల గెలవలేకపోయామని, ఈసారి అక్కడ ప్రత్యేక దృష్టి పెట్టి అక్కడ గెలిచేందుకు గట్టిగా కృషి చేస్తామని తెలిపారు. కమలాపురం నియోజకవర్గానికి రాష్ట్రస్థాయి పదవులు రెండు మాత్రమే వచ్చాయని, మరిన్ని పదవులు కావాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇంకా పలు సమస్యలను ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు.



పెండ్లిమర్రిలో మన గ్రోమోర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



టమోటా తోట వద్ద మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు



డ్రోన్‌తో మందుల పిచికారీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి



డ్రిప్‌ను పరిశీలిస్తూ...



పెండ్లిమర్రిలో మంత్రి అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

శివాలయంలో ఘనంగా లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు



వెండి ముఖావాడ, నాగాభరణంతో దర్శనం ఇస్తున్న నరసింహస్వామి

పెద్దతిప్పసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీకమాసం చివరి రోజున ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు బెంగళూరుకు చెందిన వేదపండితులచే లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు లండన్‌లో ఉన్న ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య కుమారుడు సనగరం లక్ష్మీనరసింహశర్మ, సాయికృష్ణ, శ్వేత దంపతులు ఆలయానికి రూ.6 లక్షల విలువైన వెండి ముఖావాడ, వెండి నాగాభరణములను ఆలయానికి బహూకరించారు. వారు అందించిన ముఖావాడ, నాగాభరణాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అలంకరించారు. కార్తీకమాసం చివరి రోజు కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 69వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలను బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని తెలిపారు.

ఇక్కడే కాకుండా చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్‌లో కూడా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు డాక్టర్ ఎస్.బాబు, నాగరాజా, మురళీధర్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని పరిశీలకులు తెలిపారు. కార్యక్రమంలో చంద్రమాకులపల్లె హెచ్‌ఎం, గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ రంగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోల జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే డిప్యూటీ ఎంపీడీవోల జిల్లా నూతన కమిటీని బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 30 మండలాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవోలు సమావేశానికి హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా టి.సురేశ్‌బాబు (రాయచోటి డిప్యూటీ ఎంపీడీవో), జనరల్ సెక్రటరీగా సి.రాంమోహన్‌రెడ్డి (ఓబులవారిపల్లె డిప్యూటీ ఎంపీడీవో), ట్రెజరర్‌గా టి.భారతి (మదనపల్లె డిప్యూటీ ఎంపీడీవో), వైస్ ప్రెసిడెంట్‌గా సి.అష్రఫ్‌వలి (రాజంపేట, డిప్యూటీ ఎంపీడీవో)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు హాల్‌టిక్కెట్లు

రాజంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నారంరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఇందుకు సంబంధించిన హాల్‌టిక్కెట్లను కూడా విడుదల చేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికల చదువు, బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిక అధికారి హైమావతి తెలిపారు. బుధవారం చెన్నముక్కపల్లె, సుండుపల్లె రోడ్డు నారాయణ ఫంక్షన్ హాల్‌లో భేటీ బచావో, భేటీ పఢావో పథకంపై గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు జిల్లా స్థాయి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంపై గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆడ, మగ సమానత్వం అనేది మన ఇంటి నుంచే మొదలు పెట్టాలని, అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఆడపిల్లల మీద ఉన్న అపోహలను తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలను చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ ఏటీవో జయలక్ష్మి, జీఎస్‌డబ్ల్యుఎస్ డిపార్టుమెంట్ డీడీవో లక్ష్మీపతి, సీడీపీవో శశికళ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వినోద్‌కుమార్, సూపర్‌వైజర్లు, మహిళా కార్యదర్శి జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, శిశుగృహ సిబ్బంది, వన్‌స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీపీపీకి ఎమ్మెల్యేల కమిటీ

ఎర్రగుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటైన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ గురువారం ఆర్టీపీపీకి వస్తోంది. బుధవారం రాత్రి విజయవాడలో ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి గురువారం తెల్లవారుజామున ప్రొద్దుటూరులో దిగి రాయల్‌కౌంటిలో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 11గంటలకు ఆర్టీపీపీకి వస్తారు. ప్లాంటులో పర్యటిస్తారు. అనంతరం ఆర్టీపీపీ అధికారులతో సమావేశం అవుతారు. 12 మంది ఎమ్మెల్యేలతో కూడిన ఈ కమిటీ ఆర్టీపీపీ గురించి రివ్యూ చేస్తారు. ఇందు కు సంబంధించి ఆర్టీపీపీ సీఈ వాసు దేవరావు ఆధ్వర్యంలో కమిటీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం అనంతరం వారు గండికోటకు బయలు దేరి వెళతారని, అక్కడి నుంచి కడపకు వెళ్లి అక్కడ జరిగే రివ్యూల్లో పాల్గొంటారు.

మనసు పరవశించనే...

- కనువిందు చేస్తున్న జలసవ్వడులు
- గంగ ఎస్ఆర్-1 పరిసరాలు ఆహ్లాదం



పాల నురుగలా జాలువారుతున్న గంగ నీటి ప్రవాహం

దువ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్ద ఉన్న తెలుగుగంగ సబ్సిడరీ-1 పరిసరాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా రిజర్వాయర్-1లోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నిండుకుండలా దర్శనమిస్తున్న రిజర్వాయర్ చూపరులకు ముచ్చట గొలిపిస్తోంది. హెడ్ రెగ్యులేటర్ ద్వారా దిగువనున్న చెన్నముక్కపల్లె కాలువకు నీరు వెళుతున్న దృశ్యాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఎడమవైపు నుంచి నీరు వెళుతూ చెన్నముక్కపల్లె కాలువలోకి దూకే సమయంలో నురగలు కక్కుతూ ముచ్చట గొలుపుతున్నాయి. కుడివైపునున్న రంధ్రం నుంచి జాలువారుతున్న జలాలు ఆకర్షిస్తున్నాయి. ఇక్కడే హుడా నిధులతో పార్కును ఏర్పాటు చేశారు. అందులో పర్యాటకులు సేదతీరుతూ కాలక్షేపం చేస్తుంటారు. ఆదివారం ఆటవిడుపుగా ఇక్కడకు జనాలు వస్తుంటారు. ఈ ప్రాంతంలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



హెడ్ రెగ్యులేటర్ సొరంగం నుంచి కిందకు దూకుతున్న గంగ జలాలు

రిజర్వాయర్‌లోకి దిగవద్దని బోర్డులు రాసి ఉంచారు. ఈ తరహా నిబంధనలు పర్యాటకులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హెడ్‌రెగ్యులేటర్‌కు కొంత ముందుకెళుతూ కుడివైపున గోశాల ఏర్పాటు చేశారు. ఇందులో ఆవులను పెంచుతూ సంరక్షిస్తున్నారు.

ఆటో- బొలేరో ఢీ - ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, బీకేపల్లె బైపాస్ రోడ్డులో రాయల్ ఉడ్ సమీపంలో ఆటో- బొలేరో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహమ్మద్ రఫీ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి రాయచోటి వాసి షాహిదా బాను, మదనపల్లెకు చెందిన గౌసియాతో కలిసి ఆటో బాడుగకు తీసుకుని బీకేపల్లెకు వెళ్లాడనికి బయలుదేరారు. జాతీయ రహదారి దాడుతుండగా అంగళ్లు వైపు నుంచి కూరగాయలతో పుంగనూరు వైపు వెళ్లుతున్న బొలేరో ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహమ్మద్ రఫీ కుడిచెయ్యి అక్కడికక్కడే తెగి పడిపోయింది. ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆటో డ్రైవర్‌ను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. టూటౌన్ పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాతకు మహర్దశ : సబ్ కలెక్టర్



ప్రసంగిస్తున్న సబ్‌కలెక్టర్ భావన, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు

రాజంపేటటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం వల్ల ప్రతిఒక్కరికీ లాభం చేకూరుతుందని రాజంపేట సబ్‌కలెక్టర్ భావన పేర్కొన్నారు. బుధవారం రాజంపేటలో జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం వల్ల ప్రతి అన్నదాతకు ఏడాదికి రూ.10 వేల వరకు ఆర్థికసాయం లభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన లాంటి పథకాలను అనేకం ప్రవేశపెడుతుందన్నారు. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలోని అన్నదాతలకు అన్నివిధాల సహాయం చేయడంలో భాగంగా నేడు ప్రతిరైతు ఖాతాలో ఆర్థిక సహాయాన్ని వేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలువురు అదికారులు పాల్గొన్నారు. పలువురికి అన్నదాత సుఖీభవ చెక్కులను అందజేశారు.

వీరభద్రాలయంలో కార్తీక వనభోజనం

రాయచోటిటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్ఛరణల మధ్య రాయచోటి- రాజంపేట మార్గంలోని ఓదివీడు కస్పాకు సమీపంలో మాండవ్య నది ఒడ్డున వెలసిన శివరామాలయంలో కార్తీక వనమహోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం మాండవ్యనదికి జలహారతి ఇచ్చారు. ఈ వనభోజన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు.

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి

- జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ యామిని

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమె జాతీయ లోక్ అదాలత్ ముందస్తు సమావేశం వర్చువల్‌గా నిర్వహించారు. డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న కేసులపై ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, పిటీషనర్ ఎంవీఓపీ అడ్వకేట్లు, చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమంలో రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్, కడప నాల్గవ అదనపు జిల్లా జడ్జి జి.దీనాబాబు, ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.రమేష్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : వీసీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ సూచించారు. నెట్, జేఆర్ఎఫ్ అర్హత సాధించిన విద్యార్థులకు దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో యూజీసీ నెట్, ఏపీసెట్, సీఎస్ఐఆర్, నెట్ కోచింగ్ తరగతులను ప్రారంభించారు. ఈ కోచింగ్ ద్వారా పేపర్-1 పూర్తి సిలబస్‌ను నిపుణులైన అధ్యాపకులు బోధించనున్నారు. అలాగే విద్యార్థుల సందేహాలను తీర్చడానికి ప్రత్యేక డౌట్- క్లారిఫికేషన్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ కోచింగ్ ఎంతో ప్రయోజనకరమన్నారు. నెట్, జేఆర్ఎఫ్ అర్హత సాధించిన వారికి దేశవ్యాప్తంగా మంచి అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా జేఆర్ఎఫ్ ద్వారా 60 నెలల పాటు నెలకు రూ.40వేల చొప్పున మొత్తం రూ.24లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయభారతి మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రఘునాథరెడ్డి, రఘునాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సతీష్ బాబు, ఈశ్వర్‌రెడ్డి, జయంత్ కశ్యప్, పరిశోధక, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సోది కాదు... సూది నారాయణరెడ్డిని



జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంపీ అవినాశ్‌రెడ్డి తనను సోది నారాయణరెడ్డి అని అహంకారంతో మాట్లాడారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇకనుంచి తాను సోది కాదని, సూది నారాయణరెడ్డి అని మీ అవినీతిని ఎప్పుడూ గుచ్చుతూనే ఉంటానన్నారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, రైతుల సమావేశం అనంతరం బయట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తాను జమ్మలమడుగులో వైసీపీ అభ్యర్థి సుధీర్‌రెడ్డిని ఓడించానన్నారు. ప్రతిపక్షంలో ఉండాల్సిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నాయకుడిగా మారినా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. పులివెందుల ప్రజలు సున్నితమైనవారని వారిని మభ్యపెట్టి మీరు రాజకీయం పబ్బం గడుపుకుంటున్నారని చీనీలో, అరటిలో దోపిడీ చేస్తున్నారని అవినాశ్‌రెడ్డిని విమర్శించారు. వైఎస్ భారతి 400 కేజీల బంగారం కొన్నది వాస్తవం కాదా అన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌నకు వైవీయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



పర్వతారోహణ క్యాంప్‌నకు బయలుదేరిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని జాతీయ సేవా పథకం వలంటీర్లు హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి పర్వతారోహణ క్యాంప్‌నకు బుధవారం బయలు దేరివెళ్లారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి కడప రైల్వేస్టేషన్‌కి వెళ్లి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అడ్వెంచర్ క్యాంప్‌లో అద్వితీయమైన పాత్రను పోషించి విద్యాలయానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పర్వతారోహణ క్యాంప్‌నకు కంటింజెంట్ లీడర్‌గా యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.లలిత వ్యవహరిస్తున్నారు. వైవీయూ పీజీ కళాశాల, పులివెందుల ప్రభుత్వ మహిళా కళాశాల, కడప ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేఆర్‌అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీహరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పది మంది బయలుదేరి వెళ్లారు. పదిరోజుల పాటు జరిగే అడ్వెంచర్ క్యాంప్‌లో వీరి సాహసాలను ప్రదర్శించనున్నారు.

సహకార రంగంలో టౌన్‌బ్యాంక్‌కు ప్రత్యేక స్థానం



చెక్కును అందజేస్తున్న జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకుకు ప్రత్యేక స్థానం దక్కుతుందని జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య కొనియాడారు. బుధవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను స్థానిక కోనేటి కాల్వ వీధిలోని ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్‌లో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి సహకారశాఖ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సహకార వ్యవస్థ సమిష్టి ప్రయోజనాలను నెరవేర్చు తుందన్నారు. ముఖ్యంగా పేద మధ్య తరగతికి చెందిన వారికి సహకార రంగం ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ టౌన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, ఖాతాదారుల సంపూర్ణ సహకారంతోనే బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందన్నారు. ఈసందర్భంగా పలువురు బ్యాంకు ఖాతాదారులకు రుణాలు అందజేశారు. కార్యక్రమంలో డివి జనల్ సహకారశాఖ అధికారి సత్యానంద, జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బ్యాంకు సీఈవో నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌గౌస్, బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ పైపులైన్‌కు లీకేజీలు



వృద్ధాశ్రమం వద్ద గుంతలో నిలబడిన నీరు

చాపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ నుంచి ఆర్టీపీపీ థర్మల్ ప్రాజెక్టుకు వెళ్లే పైపులైనుకు లీకేజీలు ఏర్పడ్డాయి. చాపాడు గ్రామంలోని దిలీప్ గ్యాస్ గోడౌన్ వద్ద, కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమం సమీపంలో లీకేజీ కావడంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. బయటకు వస్తున్నాయి. దీంతో వృద్ధాశ్రమంలో నీరు నిలబడి వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం లీకేజీలను అరికట్టేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ పాయింట్లను గుర్తించలేకపోయారు. దీంతో నీరు వృథాగా పోతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఇంజనీర్లు లీకేజీలను గుర్తించి అరికట్టాల్సిన అవసరం ఉంది.

యాంటీబయాటిక్స్ అతిగా వాడితే ప్రమాదకరం



మాట్లాడుతున్న పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశువుల చికిత్సలో యాంటీబయాటిక్స్‌ను ఎక్కువగా వాడరాదని, డాక్టర్ల సూచనల మేరకే ఉపయోగించాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో వరల్డ్ ఎఎంఆర్ అవర్నెస్ వీక్‌లో భాగంగా ఐసీఏఆర్ ప్రాజెక్టు ద్వారా పశువులు, చేపలలో యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెంట్స్ గురించి వర్తమానాన్ని కాపాడుతూ భవిష్యత్తును భద్రంగా చూసుకునే స్కీంతో సెమినార్ నిర్వహించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ గన్నవరం పశువైద్య కళాశాల వైద్యుడు డాక్టర్ ఆనందప్రసాద్, పశువైద్యులు, విద్యార్థులకు యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెంట్స్ గురించి, దాని వలన కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. యాంటీ బయాటిక్స్ వాడకం వలన మనుషులు, మొక్కలు, ప్రకృతి ఆరోగ్యం ఏ విధంగా దెబ్బతింటుందో వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యులు మూగజీవాలకు వైద్యం చేసేటప్పుడు యాంటిబయాటిక్స్‌ను తగిన మోతాదులో వాడాలని సూచించారు. అతిగా వాడటం వలన దుష్పరిణామాలకు దారి తీస్తుందన్నారు. కళాశాల ఏఎస్‌వో డాక్టర్ రాజాకిశోర్, సూక్ష్మశాస్త్ర విభాగం ప్రొఫెసర్ విజయలక్ష్మిలు యాంటీబయాటిక్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోస్టర్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



వెంకటరామయ్య (ఫైల్)

మైదుకూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వని పెంట గ్రామం లెక్కలవారిపల్లె వెళ్లే రోడ్డులో బుధవారం సాయం త్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముక్కమల్ల వెంకటరామయ్య (66) అనే వ్యక్తి మృతి చెందాడు. అక్కులాయపల్లెకు చెందిన వెంకట రామయ్య తమ సమీప బంధువు అనారోగ్యంతో ఉంటే పరామర్శించేందు కు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మైదుకూరుకు చెందిన ఓ కాలేజీ బస్సు అతన్ని వెనక వైపు నుంచి ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీ, బేల్దారి పనులు చేసుకొని జీవనం సాగించే వెంకటరామయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తెకు భర్త మరణించడంతో ఆమెను, ఆమె పిల్లలను ఈయనే పోషించేవారు. అకస్మాత్తుగా కుటుంబ పెద్ద మృత్యువాత పడడంతో భార్య పిల్లలు అనాథలయ్యారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి



ప్రజా సమస్యలను ఫోన్ ద్వారా అధికారులకు వివరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ కర్తవ్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించగా వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.

చిన్నమండెం: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని బుధవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమంలో వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, అధికారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే అధికారులను ఆదేశించారు.

మల్లికార్జున నాయుడుకి మండిపల్లి పరామర్శ



ఆస్పత్రిలో మల్లికార్జున నాయుడిని పరామర్శిస్తున్న మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె టీడీపీ సమన్వయకర్త కోపూరి మల్లికార్జుననాయుడుని, మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం అంగళ్లులో జరిగిన పీఎంకిసాన్-అన్నదాత సుఖీభవ ప్రారంభోత్స కార్యక్రమంలో జరిగిన సంఘటనపై ఆయన అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. పరిస్థితిని గమనించిన ఆయన అనుచరులు హుటాహుటిన మదనపల్లెలోని సంజీవని ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతున్న మల్లికార్జుననాయుడి ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆయన పరిస్థితి బాగానే ఉందని, ఇబ్బంది ఏమీ లేదని కోలుకుంటున్నట్లు తెలిపారు. ఆందోళనకు కారణమైన, కార్యకర్తలను రెచ్చగొట్టిన నేతలపై చర్యలు తీసుకోవాలని మంత్రికి అక్కడ ఫిర్యాదు చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మాట్లాడతానని హామీ ఇచ్చి కుటుంబీకులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, జనసేన తంబళ్లపల్లె ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, మదనపల్లె, తంబళ్లపల్లె టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరుకున్నారు.

రైతును ఆదుకునే 'అన్నదాత సుఖీభవ'

● పీలేరు, మదనపల్లెల్లో పథకం ప్రారంభించిన ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ బాష

పీలేరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లోనూ కేవలం రైతును ఆదుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'అన్నదాత సుఖీభవ' పథకానికి నిధులు మంజూరు చేశారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. పీలేరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం జరిగిన 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం' 2వ విడత నిధుల విడుదలలో ఎమ్మెల్యే నల్లారి మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రతిపక్షంలో ఉండగానే చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని సూపర్ సిక్స్ పథకాల్లో చేర్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని వ్యవసాయ ప్రయోజనాల కోసమే వినియోగించాలని ఆయన రైతులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు అందజేసే రాయితీలు, పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర జలశక్తి అభియాన్ ద్వారా పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు రూ.2 వేల కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో గండికోట జలాశయం నుంచి పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందిస్తారన్నారు. అనంతరం పీలేరు నియోజకవర్గంలోని 38,490 మంది లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు రూ.26 కోట్ల మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ పథకాన్ని తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ప్రధాని నరేంద్ర మోదీ, కడప జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారని, బుధవారం సాయంత్రం నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోందన్నారు.



అన్నదాత సుఖీభవ మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

బాధ్యతగా వ్యవహరించండి

అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వైసీపీ నేతల తరహాలో శ్యాండ్-ల్యాండ్, మైన్స్-వైన్స్‌లో అక్రమాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, సామాన్యులపై దౌర్జన్యాలు చేయకూడదన్నారు. అడ్డదిడ్డంగా అక్రమాలు చేసి ప్రజాగ్రహానికి గురైన వైసీపీ నేతలను ఆదర్శంగా తీసుకోవద్దని నియోజకవర్గం పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే నల్లారి సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీ రమణరావు, నియోజకవర్గ పరిశీలకులు సూరా సుధాకర్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, యల్లెల రెడ్డప్ప రెడ్డి, కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, నారే సతీశ్ రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, షౌకత్‌అలీ, స్పోర్ట్స్ మల్లి, సాధన, రమాదేవి, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.13.67 కోట్లు పంపిణీ

మదనపల్లె టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో నియోజకవర్గం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద మంజూరైన రూ.13.67 కోట్లు రైతు ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం 20,162 మంది రైతులు లబ్ధిపొందారన్నారు. రైతులకు 9గంటల పాటు ఉచిత విద్యుత్, పంట రుణాలు ఇస్తూ ప్రభుత్వం పాడి, వ్యవసాయ రంగాలను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్, వైస్‌ఛైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు, టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, మధు బాబు, ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

నిమ్మనపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులను విడుదల చేసినట్లు ఏఓ మంజుల తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ కింద రూ5వేలు, ప్రధాన మంత్రి మోదీ రూ. 2వేలను మొత్తం రూ. 7వేలను రైతుల వ్యక్తి గత ఖాతాల్లో నిధులను జమచేసినట్లు తెలిపారు. దీంతో కూటమి నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి బాణసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు.

ప్రతి వ్యక్తిపై పుస్తక ప్రభావముంటుంది

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి







కలకడ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ అంజలీదేవి - తంబళ్లపల్లెలో ముగ్గులు వేస్తున్న బాలలు - కలకడలో ముగ్గుల పోటీలో న్యాయనిర్ణేతలు, విద్యార్థినులు

కలికిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి వ్యక్తి అభివృద్ధి, వికాసంలోనూ పుస్తకాల ప్రభావం తప్పక వుంటుందని ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి అన్నారు. పుస్తకాలను చదవడం ద్వారా ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఆమె స్పష్టం చేశారు. గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి విజయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ గులాబ్‌జాన్, అధ్యాపకులు ఉదయ, కీర్తి, మాధవి, జి.మాధవి, స్వర్ణలత, హాజీరా, శైలజ, లిఖిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఆదరించాలి

పీలేరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ విధిగా ఆదరించాలని తెలుగు భాషా సంఘం పూర్వ సభ్యులు, సాహితీవేత్త డాక్టర్ వేంపల్లె అబ్దుల్ ఖాదర్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెరిచిన పుస్తకం ప్రపంచాన్ని చూపిస్తే, ఆ ప్రపంచాన్ని విజ్ఞాన మయం చేసేది గ్రంథాలయమన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డీవైఈఓ లోకేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు ప్యారూఖాన్, సీఆర్‌పీ, రచయిత జలకనూరి మురళీధరరాజు, రచయిత సరస్వతి శ్రీరాములు రాజు, నరసింహులు, జయపాల్ రెడ్డి, లైబ్రేరియన్ అమరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

తంబళ్లపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, విద్యా వికాసానికి మూలమని అందుకే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానం పొందాలని శ్రీ సాయి స్కూల్ హెచ్‌ఎం షాజీదాబేగం అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు రంగవళ్లుల పోటీలు నిర్వహించారు. బాలలు ఉత్సాహంగా ముగ్గులు వేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జిలానీ బాష, టీచర్లు సుజాత, గౌసియా, భార్గవి పాల్గొన్నారు.

సంప్రదాయ కళల్లో ప్రావీణ్యం సంపాదించాలి

కలకడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సంప్రదాయ కళల్లో ప్రావీణ్యం సంపాదించాలని బాటవారిపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకట సుబ్బయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవ మహిళాదినోత్సవం పురస్కరించుకుని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ రంగవల్లులకు గురువారం బహుమతులు అందజేయనున్నారు. ఉపాధ్యాయులు లోకా జగన్నాథశాస్త్రి, బాబురెడ్డి, లైబ్రేరియన్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే, నేతలు



మంత్రి జనార్దన్‌రెడ్డితో ఎమ్మెల్యే షాజహాన్‌బాష, ఎస్.ఎ.మస్తాన్, రామకృష్ణాచారి

మదనపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష, టీడీపీ నేతలు కలిశారు. పీఎంకిసాన్-అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవానికి అంగళ్లకు విచ్చేసిన ఆయన మధ్యాహ్నం స్థానిక రోడ్లు, భవనాలశాఖ అతిథిగృహానికి విచ్చేయడంతో ఎమ్మెల్యే, మంత్రితో సమావేశమయ్యారు. స్థానిక రాజకీయ పరిస్థితులపై ఇద్దరూ చర్చించారు. గంటకుపైగా ఇక్కడే ఉన్న మంత్రిని మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరాం, స్థానిక టీడీపీ నేతలు ఎస్.ఎ.మస్తాన్, పఠాన్ ఖాదర్ ఖాన్, రాటకొండ మధుబాబు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.రామకృష్ణాచారి, వై.దొరస్వామినాయుడు, తదితరులున్నారు.

30 కుటుంబాలు బీజేపీలో చేరిక



కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన స్థానికులు

కలికిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బుధవారం కలికిరి బీజేపీలో భారీగా చేరికలు జరిగాయి. మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో 30 కుటుంబాలు చేరారు. వారందరికీ కిరణ్‌కుమార్ రెడ్డి స్వయంగా పార్టీ శాలువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఎక్సేంజి వీధి, ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల మహిళలు సహా బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నూర్ మహ్మద్, రామారావు, సలీం, అబ్దుల్ జబ్బార్, నాగరాజ, శ్రీను, చంద్ర, మేస్త్రీ యల్లప్ప, రెడ్డెప్ప, ఉమాపతి, నూరుల్లా తదితరులు కుటుంబీకులతో సహా పార్టీ కండువాలు కప్పుకొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్ర రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు కుమార్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక నేతలు ఆనంద రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన రూరల్ సీఐ రవి నాయక్

మదనపల్లె అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రూరల్ సీఐగా రవినాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి నుంచి బదిలీపై మదనపల్లెకు వచ్చారు.

ప్రతి మహిళ ఝాన్సీలా రూపుదిద్దుకోవాలి

మదనపల్లె టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా చదువుకుని ఝాన్సీలక్ష్మీబాయిలా రూపుదిద్దుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం స్త్రీశక్తి దివస్ సందర్భంగా స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. తిరుపతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు చైతన్య, పద్మావతి, ఇంద్రాణి, ప్రిన్సిపాల్ రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

కురబలకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడం, పచ్చదనం పెంపొందించడంపై గురువారం నుంచి సర్పంచులకు శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాభివృద్ధిని సాధిద్దామని, అన్ని శాఖలు అధికారులు కలిసి కట్టుగా సమన్వయంతో పని చేసి అభివృద్ధిని సాధించాలన్నారు. కాగా 20న సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు 21న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్‌గార్డులు, ఎంఆర్‌సీ, 22న ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వీఓఏ సభ్యులకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ కన్‌స్ట్రక్షన్ ఫిట్టర్ కోర్సులకు ఆసక్తి గల నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని టీఓ నాగరాజు ప్రకటించారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందన్నారు. నిరుద్యోగ యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆసక్తి ఉన్న 15 నుంచి 40 ఏళ్ల లోపు యువత ఈ నెల 27వ తేదీ లోపు స్కిల్ హబ్ సెంటర్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ చౌడయ్య నెం:9618655759లో సంప్రదించాలని కోరారు.


'ఎస్వీయూ ఫీజు మాడ్యూల్‌లో సాంకేతిక లోపం'

పీలేరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో యూజీ ఆన్‌లైన్ పరీక్ష ఫీజు మాడ్యూల్‌తో విద్యార్థులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత తేజ డిమాండ్ చేశారు. విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఎస్వీయూ నవంబరు 2025 యూజీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల కోసం కొత్త ఆన్‌లైన్ ఫీజు మాడ్యూల్‌ను తీసుకొచ్చిందన్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆన్‌లైన్ విధానంలో సబ్జెక్టులు, పేపర్లు కనిపించక పోవడం వల్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం ఇబ్బంది కరంగా మారిందన్నారు. పరీక్ష ప్రక్రియను సమయానికి పూర్తి చేయలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సప్లమెంటరీ విద్యార్థులు ఫెయిల్ అయిన పేపర్లు వెబ్‌సైట్‌లో కనిపించడంలేదన్నారు. ఫీజు చెల్లింపు కోసం తక్కువ సమయం, ఆలస్య రుసుం రూ. 3 వేలు చేయడం విద్యార్థులపై ఆర్థిక భారం మోపడమేనన్నారు. ఆన్‌లైన్‌లో సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో డిజిటల్ మోసాలు పెరిగాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తంబళ్లపల్లె ఎస్‌బీఐ మేనేజరు సుదీర్ సూచించారు. బుధవారం స్థానిక స్టేట్ బ్యాంకులో డిజిటల్ మోసాలకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ పే ద్వారా డబ్బు వేయడం, తీసుకోవడం వంటివి చేయరాదన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఖాతా నుంచి డబ్బు పోతే వెంటనే 1930 కాల్ చేసి సైబర్ క్రైమ్‌కు కంప్లైంట్ చేయాలని సూచించారు. డిజిటల్ అరెస్టులు అనేవి బూటకమని ప్రజలు అటువంటివి నమ్మవద్దని సూచించారు. ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు అవసరమైతే 18001234 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి 54 రకాల సేవలను పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎన్‌వీఎస్ శర్మ, నవీన్, చంద్ర, ఖాతాదారులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం వద్ద మరోసారి ఉద్రిక్తత



వివాదాస్పద స్థలం వద్ద గుమికూడిన జనం

బి.కొత్తకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని వివాదాస్పద స్థలంలో బుధవారం మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. గంగమ్మ మాన్యం భూమికి ఆనుకుని రూ.కోట్ల విలువ చేసే భూమి వుంది. ఈ భూమిపై హక్కులు తమకే ఉన్నాయంటూ ఇరువర్గాలూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు తమకు అనుకూలంగా ఆర్డరు ఇచ్చిందని ఓ వర్గం, ఇంజంక్షన్ ఆర్డరు తమకుందని మరో వర్గం వాదించుకుంటూ వుండగానే ఒక వర్గం ఇటీవల ఈ స్థలంలో షెడ్ల నిర్మాణం చేపట్టింది. అప్పట్లో ప్రత్యర్థి వర్గం అడ్డుపడినా నిర్మాణం దాదాపుగా జరిగిపోయింది. దీంతో తాజాగా బాధిత వ్యక్తి, ఇంటి మహిళలు వచ్చి నిర్మాణాలకు అడ్డు తగిలారు. షెడ్లను తెరవనిచ్చేది లేదని నిర్మించిన వారితో వాదనకు దిగారు. ఇరు వర్గీయులూ పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని వాగ్వాదం చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాగా ఈ విషయమై సమాచారం వున్నా అధికార యంత్రాంగం ఎవరూ అటు వైపు రాకపోవడం విశేషం.

స్టాంప్‌వెండర్‌పై పోలీసులకు ఫిర్యాదు

● కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ దందా
● రైతుల నుంచి వసూలు చేస్తున్న వైనం

బి.కొత్తకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్‌వెండర్ల రాజ్యం కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ విషయంలో వీరు చెప్పిందే రూలు, పలికిందే ఫీజు అన్నట్లు సాగుతోంది. చిన్నపాటి సమస్యను సైతం పెద్దగా చూపి రైతులను భయపెట్టి మరీ వీలైన కాడికి గుంజేస్తున్నారు. తాజాగా ఓ రైతు స్టాంపువెండరు చెప్పిన పైకం చెల్లించినా పని జరగక పోవడం బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకెళితే...

పీటీఎం మండలం పట్టెంవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని సర్వేనంబరు 509బి, 509బి1, 510బి1, 5112బిలో చౌడపు చౌడప్ప పేరున వ్యవసాయభూమి వుంది. చౌడప్ప మరణానంతరం అతని ఇద్దరు కుమారులు చెరిసగం పంచుకోవాల్సి వుంది. చౌడప్ప భార్య పేరుపై మారిన భూమిలో ఓ కుమారుడు సగం తన పేరున మార్చుకున్నాడు. మిగతా సగభాగం రిజిస్ట్రేషన్ కోసం ప్రస్తుతం సత్యసాయిజిల్లా, నల్లచెరువు మండల కేంద్రంలో ఉంటున్న మరో కొడుకు శంకర దరఖాస్తు చేసుకున్నాడు. ఇతని వద్ద బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాయం వద్ద నున్న ఓ దస్తావేజు లేఖకుడు రెండు విడతలుగా రూ.19000 తీసుకున్నాడు. అయినా పనిజరగలేదు. కొర్రీలు పెడుతూ తిప్పుకుంటున్నాడు. డబ్బు తిరిగి ఇవ్వమన్నా ఇవ్వలేదు. ఈ మేరకు బాధితుడు చౌడపు శంకర బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ దందా ఏ స్థాయిలో జరుగుతోందో ఈ సంఘటన తేటతెల్లం చేసింది.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి



సిద్దవరం వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దమండ్యం, న వంబరు 19 (ఆం ధ్రజ్యోతి): పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసు కోవాలని ఎంపీడీఓ శ్రీధర్ రావు వెల్ల డించారు. పెద్దమండ్యం, సిద్దవరం, శివపురం, కలిచెర్ల గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీఓ మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రభుత్వం ఇళ్ల మంజూరుకు శ్రీకారం చుట్టిందన్నారు. సచివాలయాల్లో ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానిమంత్రి అవాస యోజన గ్రామీణ పథకం ద్వారాఅర్హులకు ఇళ్లు మంజూరు చేస్తారన్నారు. 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందు ఇళ్లు మంజూరైన వారితో పాటు ప్రధానంగా నిర్మాణాల కోసం ముందస్తు అడ్వాన్సు తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్పంచులు బాష, విజయకుమారి, గంగులమ్మవిశ్వనాథ, హౌసింగ్ ఏఈ అక్రమ్, ఇంజనీరు అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యూత్‌ఫెస్టివల్‌కు మదనపల్లె విద్యార్థులు



రాష్ట్ర యూత్‌ఫెస్టివల్‌కు ఎంపికైన మదనపల్లె విద్యార్థులు

మదనపల్లె టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో నిర్వహించిన జిల్లా స్థాయి యూత్‌ఫెస్టివల్‌లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపారని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ జిల్లా యూత్‌ఫెస్టివల్‌లో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థినులు లంబాడా నృత్యంలో ప్రథమ స్థానం, జానపద గీతంలో ప్రథమ స్థానం, జానపద నృత్యంలో ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారన్నారు. వీరందరూ విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ రమాదేవి, డాన్స్‌మాస్టర్ సురేష్ అభినందించారు.

చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

మదనపల్లె అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కోమటివాని చెరువు పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోమటివానిచెరువు అక్రమణ దారులపై కేసులను నమోదు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బండమీద కమ్మపల్లె రెవెన్యూ సర్వేనెంబరు 280లో 43 ఎకరాలకు పైగా ఉన్న కోమటివానిచెరువు ప్రస్తుతం సగానికి పైగా ఆక్రమణకు గురైందన్నారు. దీనిని కాపాడడం కోసం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమాజాన్ని నడిపించేది మహిళలే

మదనపల్లె అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని ముందుకు నడిపించడంలో మహిళల పాత్ర అమోఘమని ప్రముఖ మహిళా శిరోమణులు పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ అధికారి వసంత కుమారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఫోర్టు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ లలితమ్మ, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రాధిక ట్రాఫిక్ ఎస్‌ఐ శివకామిని, బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజరు కోటిరెడ్డి, కవయిత్రి హేమలత, బూన్ స్కూల్ హెచ్‌ఎం రమాదేవి, వివేకానంద ఆశయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుంపు భానుప్రకాష్ పాల్గొన్నారు.